క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

దుండిగల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు డీపోచంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుమార స్వామి ప్రకటనలో తెలిపారు. డీపోచంపల్లి, సారెగూడెం, ఎంఎల్ఆర్ కళాశాల, గాగిల్లాపూర్, గండిమైసమ్మ చౌరస్తా యూనియన్ బ్యాంక్ వెనుక భాగం, ప్రగతి స్కూల్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

నిజాంపేట్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో నిరసనలు తెలియజేయనున్నట్లు మేయర్ కొలన్ నీలారెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇప్పటికే పెరిగిన గ్యాస్ ధరలు పేదలకు గుదిబండగా మారాయని అన్నారు. తాజాగా ధరలు పెంచడంతో మరింత భారం కానుందన్నారు. ఉదయం 9.30 గంటలకు జరిగే ఆందోళన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర వైఖరిని వ్యతిరేకించాలని మేయర్ కోరారు.

ఐఎల్ఓ సభకు భరత్‌గౌడ్



జగద్గిరిగుట్ట: ఇంటర్నేషనల్ లేబర్ అర్గనైజేషన్ సదస్సులో మేడ్చల్ జిల్లా ఐఎన్‌టీయూసీ యూత్ అధ్యక్షుడు భరత్‌గౌడ్ పాల్గొన్నారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు నేపాల్‌లో జరిగే ఐఎల్ఓ (ఇంటర్నేషనల్ లేబర్ అర్గనైజేషన్) సభలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పిలుపు రావడంతో భరత్‌గౌడ్ నేపాల్ వెళ్లి సభల్లో పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ జోనల్ స్థాయి సమావేశం

కుత్బుల్లాపూర్: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ జోనల్ స్థాయి సమావేశం జరిగింది. అందులో భాగంగా చేపట్టిన కార్యక్రమాలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. స్వచ్ఛ పర్యవేక్షణలో చేపట్టబోయే కార్యక్రమాలకు కేటగిరీల వారీగా 1750 మార్కులు కేటాయించామన్నారు. సెగ్రిగేషన్ వేస్ట్ కలెక్షన్‌కు 300 మార్కులు.. తడి, పొడి చెత్త వేరు చేయడానికి 150 మార్కులు.. శానిటేషన్ కార్మికుల నైపుణ్యత శిక్షణకు 100మార్కులు.. శానిటేషన్ ఇన్‌స్పెక్షన్‌కు 100 మారులు.. పార్కుల శుభ్రతకు 100 మార్కులు.. శుభకార్యాల్లో జీరో వేస్ట్ వ్యర్థాలకు 90 మార్కులు ఇవ్వనున్నామని ఆమె తెలిపారు. అదే విధంగా బహిరంగా ప్రదేశాలు, చెరువులు తదితర ప్రాంతాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మాదిగ అమరవీరుల త్యాగాలు వృథా కానివ్వం

జీడిమెట్ల: మాదిగ అమరవీరుల త్యాగాలు వృథా కానివ్వమని ఎమ్మార్పీఎస్ నాయకులు సిలివేరు శ్రీనివాస్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మాదిగ హక్కుల కోసం పోరాడి మృతి చెందిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మాదిగల చిరకాల వాంఛ అయిన ఎస్సీ వర్గీకరణ (ఏబీసీడీ) సాధించి తీరుతామన్నారు. మాదిగల హక్కుల కోసం ప్రాణాలు తీసుకోకుండా పోరాడి హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక ఫౌండర్ రామడుగు సిద్దయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాసమల్ల యాదగిరి, సంఘి మహేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులోకి ఆక్సిజన్ పార్కు



దూలపల్లిలోని ఆక్సిజన్ పార్కు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లిలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పార్కు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ప్రజలకు అందుబాటులోకి వచ్చిన పార్కును బుధవారం అటవీశాఖ అధికారులు ప్రారంభించారు. ఈ పార్కును 50హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. పార్కు సమయ వేళలు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ తెలిపారు. ప్రతిరోజు టిక్కెట్ ధర పెద్దలకు రూ.20, చిన్నారులకు రూ.15, నెలపాస్ రూ.150, సంవత్సరానికి రూ.1200వందలు, వీడియో షూటింగ్‌లకు రూ.2500గాను నిర్ణయించారు.

బీఆర్ఎస్‌కు విశాల్‌గౌడ్ గుడ్ బై

జీఎస్పీలో చేరుతున్నట్లు ప్రకటన!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేపీ విశాల్‌గౌడ్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద సోదరుడు కేపీ విశాల్‌గౌడ్ పార్టీకి గుడ్ బై చెప్పి బీఎస్పీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కొంతకాలంగా ఎమ్మెల్యే వ్యవహార శైలి నచ్చక పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్న విశాల్‌గౌడ్‌తో బీఎస్పీ నాయకులు చర్చలు జరిపి బుధవారం కుత్బుల్లాపూర్ గ్రామంలోని ఆయన నివాసంలో ఉత్తరప్రదేశ్ రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్, సుధాకర్ ముదిరాజ్‌లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బడుగులకు రాజ్యాధికారం దిశగా బీఎస్పీ పార్టీ కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్ అన్నారు. తప్పకుండా తెలంగాణలో తిరుగులేని శక్తిగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఏకమై ఈ ప్రాంతంలో బీఎస్పీ పార్టీని బలోపేతం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కేఎం ప్రతాప్ లాంటి నాయకులకు తెలంగాణ ప్రభుత్వం ఎటువంటి న్యాయం చేయ లేకుండా పోయిందని, అటువంటి వారికి తమ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో కబ్జాలు: విశాల్ గౌడ్

అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకుల అండదండలతో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని..., వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని విశాల్‌గౌడ్ అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను అద్దెలకు తీసుకొని కిరాయి కడుతున్నారని.. ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రి లేదన్నారు. వెంటనే ప్రభుత్వం 50 నుంచి 100 పడకల ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ నగర్, హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశం, కైసర్‌నగర్, పేట్ బషీరాబాద్, జగద్గిరిగుట్ట, దేవేందర్ నగర్, గాజులరామారం తదితర ప్రాంతాల్లో భూకబ్జాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. అందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు అండగా ఉన్నారని తెలిపారు. ఆ స్థలాలను కాపాడి అక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తానని పేర్కొన్నారు.

బ్రేక్‌ఫాస్ట్ రాజకీయం వేడెక్కింది...

బీఎస్పీ నేతలు రాజకీయ కురువృద్ధుడైన కేఎం ప్రతాప్ నివాసానికి వచ్చి బ్రేక్‌ఫాస్ట్ చేస్తారని విలేకరులకు సమాచారం ఇవ్వడంతో ఇక్కడ రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎమ్మెల్యే వివేకానందుకు స్వయానా బాబాయ్ అయిన ప్రతాప్ తనయుడు విశాల్‌గౌడ్ బీఎస్పీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం త్వరలోనే పార్టీలో చేరుతానని ప్రకటించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

- బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు నియోజకవర్గంలో అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే స్వేరో సంస్థలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్ ఓటింగ్ శాతం ఎక్కువగా ఉండటంతో బీసీ నాయకుడైన విశాల్‌గౌడ్‌పై బీఎస్పీ ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. ఏది ఏమైనా వచ్చే అసెంబ్లీ ఎన్నికలు రసవత్తరంగా మారే అవకాశాలు ఉన్నాయి.

వీధి కుక్కలు డీహైడ్రేషన్‌తో వింతగా ప్రవర్తిస్తాయి



శ్రీకృష్ణవేణి స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ అధికారి ఉమారాణి

రంగారెడ్డినగర్: చిన్నారులపై వీధి కుక్కల దాడుల ఘటనల నేపథ్యంలో బుధవారం నందానగర్‌లోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఎంటమాలజీ అధికారి ఉమారాణి మాట్లాడుతూ... వీధి కుక్కల బెడదను నివారించేందుకు వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో పాటు రేబిస్ టీకాలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. చిన్నారులను ఒంటరిగా బయటకు పంపించకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు. వేసవిలో వీధి కుక్కలు డీహైడ్రేషన్‌తో వింతగా ప్రవర్తిస్తాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలో వీధి కుక్కల బెడద ఉన్న ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, పాఠశాల యాజమాన్యం బాషా, ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎగ్జామ్ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్స్ అందజేస్తున్న దయాకర్‌గుప్తా

సుభాష్‌నగర్: మేడ్చల్ జిల్లా మీసేవల సంఘం అధ్యక్షుడు దయాకర్‌గుప్తా తన పుట్టినరోజును బుధవారం సూరారంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారికి పదో తరగతి పరీక్ష రాయడానికి అవసరమైన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుఖదేవ్, ఉపాధ్యాయులు నరసింహులు, జనార్దన్‌రెడ్డి, విద్యాసాగర్, సుమ తదితరులు పాల్గొన్నారు.

బొట్టు భిక్షపతి మృతి సీపీఐకి తీరని లోటు

జగద్గిరిగుట్ట: బొట్టు భిక్షపతి అకాల మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్‌స్టాప్‌లో భిక్షపతి చిత్రపటానికి సీపీఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఉమామహేష్ మాట్లాడుతూ.. మృతి చెందిన కామ్రేడ్స్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవశ్యకత పార్టీ నాయకులపై ఉందన్నారు. అమరవీరుల ఆశయాలు సాధించిననాడే వారికి నిజమైన నివాళులని అన్నారు. పార్టీ కార్యకర్తలు అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. అదే విధంగా భిక్షపతి కుటుంబసభ్యులు మనోధైర్యంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఉజ్జిని హరనాథ్‌రావు, మున్సిపల్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు ప్రవీన్, కత్తుల దుర్గయ్య, కొమ్ము వెంకటేష్, యాకయ్య, వెంకటేష్, కృష్ణ, రామస్వామి, సాయిలు, బాబు, ఇమామ్, సోమయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని పరిష్కరించాలి



ఇన్‌చార్జ్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బంజారా నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ 20వ డివిజన్‌లో నెలకొన్న నీటి ఎద్దడిని పరిష్కరించాలని బుధవారం బంజారా నాయకులు ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..,.. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలపొందిన వివేకానంద్, రెండుసార్లు ఎమ్మెల్సీగా ఎన్నికై న శంభీపూర్‌రాజు, స్థానిక కార్పొరేటర్ బాలాజీ నీటి ఎద్దడిని తీర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. దీంతో స్థానిక మహిళలు అరకిలో మీటరు నడుచుకుంటూ వెళ్లి నీటిని మోసుకురావాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అదే విధంగా స్థానికంగా గుడిసెల్లో నివాసముంటున్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వాలన్నారు. లేకుంటే 60 గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. నీటి సమస్యను పరిష్కరించకుంటే కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హట్రావత్‌కృష్ణ నాయక్, హరినాయక్, గిరినాయక్, సుందర్ సింగ్‌నాయక్, రాములునాయక్, వినోద్ నాయక్, ఎల్లస్వామి తదితరులు ఉన్నారు.

'హాత్ సే హాత్ జోడో'

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం సూరారం డివిజన్ పరిధి విశ్వకర్మకాలనీ, లక్ష్మీనగర్, మస్తానా ఎన్‌క్లేవ్, సూరారం గ్రామం ప్రాంతాల్లో ×హాత్ సే హాత్ జోడో॰యాత్ర చేపట్టిన ఆయన పార్టీ జెండాలను ఎగుర వేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షుడు ఆవిజె జేమ్స్, సంజీవరెడ్డి, పండరీరావు, సంతోష్‌ముదిరాజ్, శ్రీశైలంయాదవ్, సంపంగి వెంకటేష్, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, నవీన్, అబ్బాస్, సలీమ్, సోహైల్, రజాక్, సురేందర్ రెడ్డి, సురేష్, మల్లేష్, యాదమ్మ, గౌష్య బేగం, హసీనా, అన్నపూర్ణ, వరలక్ష్మి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్తంభం పడిపోవచ్చు.. జాగ్రత్త!



రోడ్డు పైకి ఒరిగిన విద్యుత్ స్తంభం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్ సమీపంలోని ఇందిరగాంధీ విగ్రహం వద్ద కొన్ని రోజులుగా ఓ విద్యుత్ స్తంభం ఓ వైపునకు ఒరిగింది. దీంతో అది ఎప్పుడు ఎవరిపై కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్తంభం కూలి ప్రాణనష్టం జరుగక ముందే అధికారులు మేల్కొని కొత్త ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– జగద్గిరిగుట్ట

ప్యాచ్‌వర్క్ చేపట్టండి



శ్రీసాయికాలనీలో రోడ్డు ఇలా..

చింతల్: చింతల్ డివిజన్ శ్రీసాయికాలనీలో 7 నెలల క్రితం భూగర్భ డ్రైనేజీ లైన్ వేశారు. ఆ తర్వాత ప్యాచవర్క్ చేపట్టకుండా కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయాడు. రాళ్లు బయటికి తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ప్యాచ్‌వర్క్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి





సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, పాల్గొన్న అధికారులు, సిబ్బంది

- 14 కేంద్రాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు
- సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ నర్సింహా రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఉపాధ్యాయ శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికలను ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా అధికారులంతా సమన్వయంతో పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సెక్టోరియల్, నోడల్, జిల్లా స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 13 జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాలకు గాను 8 పోలింగ్ కేంద్రాలను కీసరలో, 6 పోలింగ్ కేంద్రాలను మల్కాజిగిరిలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో 6,536 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్నారని, వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నిర్ణయించినందున.. అందుకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి వసతి, వెబ్‌కాస్టింగ్, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. మూత్ర శాలలు, ఇతర మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర సామగ్రితో వెళ్లాల్సి ఉంటుందని, వారికి ప్రత్యేకంగా పోలీసు బందోబస్తుతో కూడిన బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఎన్నికల అధికారులు పాపిరెడ్డి, రంగాచారి, సెక్టోరియల్, నోడల్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేంద్రం పేదల నడ్డి విరుస్తోంది

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువులతో పాటు గ్యాస్ ధరలను పెంచుతూ పేద ప్రజల నడ్డి విరుస్తోందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు ఆరోపించారు. రూ.500 ఉన్న గ్యాస్ సిలిండర్ ఎనిమిదేళ్ల మోదీ ప్రభుత్వం పలుమార్లు పెంచుతూ సామాన్యులపై భారం మోపుతుందన్నారు. నిన్నటి వరకు రూ.1130 ఉన్న గ్యాస్ ధర బుధవారం మరో రూ.50 పెంచడంతో రూ.1180కి ఎగబాకిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేలా ప్రజలను చైత్యవంతం చేసేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేంత వరకు బీఆర్ఎస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్సీ రాజు హెచ్చరించారు.

మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు...



నీటి తొట్టిలను ప్రారంభిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: వేసవిలో మూగ జీవాలు, పక్షుల దాహార్తిని తీర్చడానికి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం మేయర్ కొలన్ నీలారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేషన్ వ్యాప్తంగా నీటి తొట్టిలను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... వేసవిలో మూగజీవాలు, పక్షుల సంరక్షణకు చర్యలు చేపట్టామన్నారు. అందులో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అజీజ్‌ఖాసీం, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో బీజేపీ గెలుపును ఆపలేరు

– బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్



స్ట్రీట్ కార్నర్ సమావేశాల విజయోత్సవ ముగింపు సభ మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద ప్రగతి యాత్ర చేసినా... మోకాళ్ల మీద యాత్ర చేసిన కుత్బుల్లాపూర్‌లో బీజేపీ గెలుపును ఆపలేరని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లో స్ట్రీట్ కార్నర్ సమావేశాల విజయోత్సవ ముగింపు సభ జరిగింది. ఈ సభకు మాజీ ఎమ్మెల్యేలు నందీశ్వర్‌గౌడ్, కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

సమస్యలు పట్టించుకోకుండా ఆధిపత్య పోరుకు...

ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి చెందారో లేదో కానీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే మాత్రం కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. 59 జీవో కింద పెద్ద మొత్తంలో చెల్లించాలని నోటీసులు అందుకున్న వారికి న్యాయం చేయకపోతే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలోని పేదలకు ఎనిమిదేళ్లలో ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయలేదన్నారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ఇళ్లను ఇప్పించే దమ్ము ఎమ్మెల్యేకు లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారిందన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆధిపత్య పోరుకు దిగుతున్నారని విమర్శించారు. స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి బీఆర్ఎస్ నేతల్లో దడ పుట్టిందన్నారు.

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వచ్చి తీరుతుంది..

మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రావడం వల్లే దేశంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఉగ్రవాదుల దాడులతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రధాని మోదీ ఆశీర్వాదం తెలంగాణపై ఉందన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఖచ్చితంగా వచ్చి తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్‌రెడ్డి, రాజిరెడ్డి, బావిగడ్డ రవి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేకే శేఖర్‌యాదవ్, సదానందం, పత్తి రఘుపతి, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్యామ్‌రావు, జిల్లా అధికార ప్రతినిధులు మేకల సురేష్‌రెడ్డి, రాజేష్ మిశ్రా, జయశంకర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి జగన్, కొంపల్లి, నిజాంపేట్ మున్సిపల్ అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, ఆకుల సతీష్, డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, పున్నారెడ్డి, పత్తి సతీష్, దుర్యోధనరావు, కంది శ్రీరాములు, రాజేశ్వరరావు, పులి బలరాం, డివిజన్ ఇంచార్జ్‌లు మోతే శ్రీనివాస్, కృష్ణయాదవ్, సుశాంత్‌గౌడ్, బిల్లావెంకటేష్, రాజిరెడ్డి, శ్రీధర్ వర్మ, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అరకల సుధా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం



శ్రీకాంత్‌రెడ్డి మృతదేహం

దుండిగల్: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపేట ప్రాంతానికి చెందిన నాగిరెడ్డి కుమారుడు ఎస్.శ్రీకాంత్‌రెడ్డి(28) యూపీవీసీ విండోస్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. జనవరి 27వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన శ్రీకాంత్‌రెడ్డి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు శ్రీకాంత్‌రెడ్డి ఫోన్‌కు కాల్‌చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. శ్రీకాంత్ కోసం కుటుంబసభ్యులు వెతుకుతుండగా మల్లంపేట చెరువు కట్ట వద్ద శ్రీకాంత్‌కు చెందిన ద్విచక్రవాహనాన్ని కుటుంబసభ్యులు గుర్తించారు. అనంతరం ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. అక్కడకు చెరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో చెరువు నుంచి వెలికి తీయించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేవైఎం జిల్లా కార్యనిర్వాహక సభ్యుడిగా అరుణ్‌కుమార్‌గౌడ్



అరుణ్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

రంగారెడ్డినగర్: మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేవైఎం కార్యనిర్వాహక సభ్యుడిగా నియమితుడైన నల్ల అరుణ్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం షాపూర్‌నగర్‌లో తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ సత్కరించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. బీజేవైఎం బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యలు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానన్నారు. కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండాను ఎగురవేస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, అఖిల్, సాయినాథ్‌యాదవ్, భానుగౌడ్, మహేష్, కుషాల్, ఘని, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి నుంచి గ్రీన్‌హిల్స్ కాలనీ వెళ్లే రోడ్డులో తాగునీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్ పగిలి నాలుగు రోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఈ విషయమై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు రోడ్డుపై నిలవడంతో లక్షలు వెచ్చించి వేసిన రోడ్డు గుంతల మయంగా మారిందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకుని లీకేజీని అరికట్టాలన్నారు.